16 ఏండ్లలోపు పిల్లలు సోషల్ మీడియా
వినియోగంపై నిషేధం!

వయోపరిమితి విధించేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం యోచన



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగింది. చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ దానికి బానిలైపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా వినియోగానికి వయో పరిమితిని తీసుకురావాలని యోచిస్తున్నది. అందులో భాగంగా 16 ఏండ్లలోపు వారిపై నిషేధం దిశగా అడుగులు వేస్తున్నది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ వెల్లడించారు. పిల్లలు తమ డివైజ్‌లకు దూరంగా మైదానాల్లో కనిపించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి వాటి వినియోగం విషయంలో పిల్లల వయసు ఎంత ఉండాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, కాకపోతే 14-16 ఏండ్ల మధ్య ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తానైతే 16 ఏండ్ల లోపు చిన్నారులకు ఇలాంటివి నిషేధించాలనే కోరుకుంటానని తెలిపారు. వయోపరిమితిపై ముస్ముందు ట్రయల్స్ మొదలవుతాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముసాయిదా బిల్లును ఈ ఏడాదే చట్టసభల్లో ప్రవేశపెడతామని ప్రధాని చెప్పారు. 'వయో పరిమితి' తీసుకురావటంపై విపక్ష నాయకుడు పీటర్ డట్టన్ మద్దతు పలుకుతున్నారు. తాము అన్నింటికీ అతీతులమన్నట్టు సోషల్ మీడియా కంపెనీలు వ్యవహరిస్తున్నాయని ఓ రేడియో యాంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాంకేతికంగా సాధ్యమేనా?

ఆన్‌లైన్ వయసు ధ్రువీకరణ.. అయ్యే పనేనా? అన్న సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధం విధించినా, ప్రస్తుత టెక్నాలజీ దాన్ని అమలుజేస్తుందన్న విశ్వసనీయత లేదని ఐటీ నిపుణుడు టాబీ ముర్రే అన్నారు. డిజిటల్ ప్రపంచంలో ఆరోగ్యకరమైన, అర్థవంతమైన ప్రాతినిధ్యానికి యువకులను దూరం చేయటం హానికరమని క్వీన్స్‌ల్యాండ్ వర్సిటీకి చెందిన డానియల్ అన్నారు.

ముడా స్కామ్‌లో 18 మంది అధికారులకు నోటీసులు
12న విచారణకు హాజరు కావాలని లోకాయుక్త ఆదేశం

మైసూర్: కర్ణాటకలోని మైసూర్ అర్బన్ డెవలప్‌ఎంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ సహా 18 మంది అధికారులకు మైసూర్ లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. పలుకుబడి కలిగిన 350 మంది వ్యక్తులకు అక్రమంగా స్థలాలు కేటాయించారన్న ఆరోపణలపై నోటీసులు జారీ చేసిన లోకాయుక్త ఈనెల 12న తప్పకుండా తమ ముందు విచారణకు హాజరు కావాలని అధికారులను ఆదేశించింది. అధికారుల అక్రమ భూముల కేటాయింపులపై 2017లో ఆర్‌టీఐ కార్యకర్త గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఈ నోటీసులు ఇచ్చింది. ముడా స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్య చిక్కుకున్న విషయం తెలిసిందే. ఆయన సతీమణికి ఖరీదైన ప్రాంతంలో భూమి కేటాయించినట్టు ఆరోపణలున్నాయి.

విషమంగా సీతారాం ఏచూరి ఆరోగ్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని మంగళవారం ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. 72 ఏండ్ల సీతారాం ఏచూరి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. దీంతో ఆగస్టు 19న ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల బృందం ఐసీయూలో ఆయనకు చికిత్స అందిస్తున్నదని, ఆయన రెస్పిరేటరీ సపోర్ట్‌తో ఉన్నారని సీపీఎం పేర్కొన్నది. ఇటీవలే ఏచూరి కాటరాక్ట్ సర్జరీ చేయించుకున్నారు. న్యుమోనియా తరహా ఛాతి ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స కోసమని ఆయనను దవాఖానలో చేర్పించారు. మొదట చికిత్సకు బాగా స్పందించినప్పటికీ క్రమంగా ఆయన ఆరోగ్యం విషమిస్తున్నది.

ప్రయాణించిన దూరానికే టోల్!

- *త్వరలో జీపీఎస్ ఆధారిత విధానం*
- *కొత్త నిబంధనలు నోటిఫై*
- *ప్రయాణ దూరం బట్టి టోల్ ఫీజు*
- *ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా కట్*

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: దేశంలో జీపీఎస్ ఆధారిత టోల్ వ్యవస్థను తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నూతన విధానం అమలు చేసేందుకు అనుగుణంగా 2008 జాతీయ రహదారుల రుసుము(ధరల నిర్ణయం, వసూలు) నిబంధనలను మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ నోటిఫై చేసింది. టోల్ వసూలుకు ప్రస్తుతం ఉన్న నగదు, ఫాస్టాగ్ చెల్లింపు విధానాలకు అదనంగా గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా నేరుగా వెళ్లేందుకు ప్రత్యేక లేన్లను ఏర్పాటు చేసేందుకు నిబంధనలను మార్చింది.

ఎలా పని చేస్తుంది?

జీఎన్ఎస్ఎస్ సాంకేతికత ద్వారా టోల్ చెల్లించేందుకు ముందుగా వాహనాలకు ఆన్ బోర్డ్ యూనిట్ల(ఓబీయూ)ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. టోల్ రోడ్డుపై వాహనం ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించిందనేది ఈ ఓబీయూ ద్వారా జీపీఎస్ కోఆర్డినేట్లు నమోదవుతాయి. ఇందుకు జీపీఎస్‌తో పాటు జియో ఆగ్మెంటెడ్ నావిగేషన్(గగన్) వ్యవస్థను వినియోగిస్తారు. మరింత కచ్చితత్వం కోసం హైవేలపై ప్రత్యేకంగా ఏర్పాటుచేసే సీసీటీవీ కెమెరాలతో సరిపోల్చి చూస్తారు. చివరగా టోల్ రోడ్డుపై వాహనం ప్రయాణించిన దూరానికి వర్తించే టోల్ రుసుము వాహన దారు లింక్ చేసిన బ్యాంకు ఖాతా నుంచి ఆటోమెటిక్‌గా కట్ అయిపోతుంది. మొదటి 20 కిలోమీటర్ల ప్రయాణానికి మాత్రం టోల్ వర్తించదు. ప్రస్తుతం దేశంలో 45,428 కిలోమీటర్ల టోల్ రోడ్డు వ్యవస్థ ఉంది. విడతలవారీగా ఈ రోడ్లపై కేంద్రం జీఎన్ఎస్ఎస్ వ్యవస్థను అమలులోకి తీసుకురానుంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు పూర్తయ్యింది.

నాగేంద్రనే మాస్టర్‌మైండ్

- వాల్మీకి స్కామ్‌లో కర్ణాటక కాంగ్రెస్ మాజీ మంత్రిపై ఈడీ చార్జిషీట్
- పక్కదారి పట్టిన 21 కోట్ల నిధులు
- లోక్‌సభ ఎన్నికల్లో నిధుల వినియోగం
- హైదరాబాద్ సత్యనారాయణవర్మ కీ రోల్
- సిట్ క్లీన్‌చిట్‌ను తప్పుబట్టిన దర్యాప్తు సంస్థ

నాగేంద్ర

బెంగళూరు, సెప్టెంబర్ 10: కర్ణాటకతోపాటు తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు రేపిన వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి బీ నాగేంద్రనే కీలక సూత్రధారి అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నిర్ధారించింది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే, ఎంపీల ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఇప్పటికే ఈ కేసును విచారించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బీ నాగేంద్రతో పాటు వాల్మీకి బోర్డు చైర్మన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌కు క్లీన్‌చిట్ ఇచ్చింది. కనీసం ఈ ఇద్దరికి నోటీసులు జారీ చేసి, విచారణ కూడా జరపలేదు. ఈడీ మాత్రం ఈ మొత్తం కుంభకోణంలో నాగేంద్రనే మాస్టర్‌మైండ్ అని తేల్చింది. నాగేంద్రతో పాటు మరో నలుగురిని నిందితులుగా ఈడీ పేర్కొన్నది. ఇప్పటికే నాగేంద్ర ఇండ్లు, కార్యాలయాలలో ఈడీ సోదాలు నిర్వహించి, నాగేంద్రను అరెస్టు చేసింది.

పక్కదారి పట్టించి.. ఎన్నికల్లో వెచ్చించి

వాల్మీకి కుంభకోణానికి సంబంధించి ఈడీ చార్జిషీట్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మతో కలిసి రూ.21 కోట్ల నిధులను నాగేంద్ర పక్కదారి పట్టించినట్టు ఈడీ పేర్కొన్నది. బెంగళూరుతో పాటు బళ్లారి నుంచి ఈ డబ్బులను వివిధ ప్రాంతాలకు అక్రమంగా పంపించారని, లోక్‌సభ ఎన్నికల్లో వీటిని వినియోగించినట్టు ఈడీ గుర్తించింది.

ఏమిటీ స్కామ్?

'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ.187 కోట్లు పక్కదారి పట్టాయి. వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కుంభకోణం వెలుగు చూసింది.

ఈ స్కామ్ గురించి చంద్రశేఖరన్ తన ఆరు పేజీల సూసైడ్ నోటులో పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు సైతం తమ బ్యాంకులోని వాల్మీకి కార్పొరేషన్ ఖాతా నుంచి చట్టవిరుద్ధంగా నగదు బదిలీ అయ్యిందని ఫిర్యాదు చేసింది. సర్వత్రా ఒత్తిడి పెరగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు చేసింది. ఈడీ సైతం రంగంలోకి దిగింది. లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే 'వాల్మీకి కార్పొరేషన్' నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది.

ఎవరీ సత్యనారాయణ వర్మ?
తెలంగాణ కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు!

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): వాల్మీకి స్కామ్‌లో ఈడీ ప్రధానంగా ప్రస్తావించిన సత్యనారాయణ వర్మ హైదరాబాద్‌కు చెందిన బిల్డర్. ఈయన వాల్మీకి కార్పొరేషన్‌కు సంబంధించిన నిధులను 'ఫస్ట్ ఫైనాన్స్ క్రెడిట్ కో ఆపరేటీవ్ సొసైటీ' ద్వారా దారి మళ్లించినట్టు ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ కుంభకోణానికి సంబంధించిన నిధులతోనే సత్యనారాయణ వర్మ రూ.3.3 కోట్లతో లాంబోర్గిని కారును కూడా కొన్నట్టు ఈడీ గుర్తించింది. ఈ కుంభకోణంలో సత్యనారాయణ వర్మతోపాటు ఇటకారి సత్యనారాయణ, చంద్రమోహన్, నాగేశ్వరరావులు కూడా ఉన్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు సత్యనారాయణ వర్మ అత్యంత సన్నిహితుడనే ఆరోపణలున్నాయి. పక్కదారి పట్టించిన కార్పొరేషన్ నిధులను లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించారని ఈడీ పేర్కొన్న నేపథ్యంలో సత్యనారాయణ వర్మ వెనుక ఎవరున్నారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నిధులకు సంబంధించి కర్ణాటక మంత్రి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు కూడా వచ్చి చర్చల్లో పాల్గొన్నట్టు సమాచారం. ఇక్కడి ఇద్దరు కీలక నేతల్లో ఒకరు రెండుసార్లు బెంగుళూరుకు కూడా ఇదే విషయంపై వెళ్లివచ్చినట్టు తెలుస్తున్నది. సత్యనారాయణ వర్మకు సంబంధించిన వ్యాపారంలోనూ ఇక్కడి కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

నవంబర్ నుంచి జేఈఈ మెయిన్-1 రిజిస్ట్రేషన్
- జనవరి చివరివారం, ఏప్రిల్ మొదటి వారంలో పరీక్షలు
- త్వరలో జేఈఈ -25 షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీల్లోని బీటెక్, బీ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్-2025 రిజిస్ట్రేషన్ నవంబర్ నుంచి మొదలుకానుంది. జనవరి చివరివారంలో జేఈఈ మెయిన్-1 పరీక్ష, ఏప్రిల్ మొదటి వారంలో జేఈఈ మెయిన్-2 పరీక్షలను నిర్వహించే అవకాశాలున్నాయి. పూర్తి షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) వారం పదిరోజుల్లో విడుదల చేయనుంది. నవంబర్ నుంచే మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. నిరుడు జేఈఈ మెయిన్ సిలబస్‌లో పలు మార్పులు చేశారు. దీంతో ఈ ఏడాది ఎలాంటి మార్పులుండకపోవచ్చు. జేఈఈ మెయిన్ ఎగ్జామ్‌ను 300 మార్కులకు మూడు గంటలపాటు నిర్వహిస్తారు.

సగానికి తగ్గనున్న కెనడా స్టడీ వీసాలు

టొరొంటో, సెప్టెంబర్ 10: కెనడా స్టడీ వీసా ఆమోదం పొందటంలో భారతీయ విద్యార్థుల కష్టాలు మరింత పెరిగాయి. దీంతో ఈ ఏడాది స్టడీ వీసాలను పొందే భారతీయ విద్యార్థుల సంఖ్య 50 శాతం వరకు తగ్గవచ్చునని కెనడా ఎడ్యుకేషన్ టెక్నాలజీ కంపెనీ 'ఆపిల్‌బోర్డ్' తాజా నివేదిక అంచనా వేసింది. స్టడీ పర్మిట్ కోసం వచ్చిన గ్లోబల్ అప్లికేషన్ల సంఖ్యలో 39 శాతం తగ్గుదల ఉంటుందని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, గత ఏడాది 4,36,000 స్టడీ వీసాలు జారీచేయగా, ఈ ఏడాది వీటి సంఖ్య కేవలం 2,31,000కు పరిమితయ్యే అవకాశముంది.

పట్టాలపై భారీ సిమెంట్ దిమ్మెలు
అజ్మీర్ వద్ద మరో రైలు ప్రమాదానికి కుట్ర

జైపూర్, సెప్టెంబర్ 10: కాన్పూర్‌లో రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్ ఉంచి కాళిందీ ఎక్స్‌ప్రెస్‌ను పట్టాలు తప్పించేందుకు జరిగిన విద్రోహ చర్యను మరువక ముందే అలాంటి మరో ఘటన రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో చోటుచేసుకుంది. ఆదివారం పులెరా నుంచి అహ్మదాబాద్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్ శారదన స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై సిమెంట్ దిమ్మెలను ఉంచారు. రైలు ఇంజన్ తాకిడికి ఒక దిమ్మె విరిగి పక్కకు పడిపోగా, మరో దిమ్మె విరిగి ముందువైపు పడింది. రైలును పట్టాలు తప్పించడానికి విద్రోహులెవరో ఈ చర్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై పోలీస్ కేసు నమోదైంది.

కాలుష్యం ఆధారంగా వాహనాల స్క్రాప్!
కొత్త పాలసీపై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కాలం చెల్లిన వాహనాల్ని తుక్కుగా(స్క్రాపేజ్) మార్చేయటంపై కేంద్రం కొత్త పాలసీని సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. వాహనాల వయసు ఆధారంగా కాకుండా, వాటి నుంచి వెలువడే కాలుష్యం ఆధారంగా తుక్కుగా మార్చాలన్నది కొత్త పాలసీలో కీలక అంశం.న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన ఓ సదస్సులో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ మాట్లాడుతూ, ' 15 సంవత్సరాలు నిండినా కాలుష్యం ఆధారంగా పాలసీ ఉండాలని భావిస్తున్నాం' అని చెప్పారు.

ట్రంప్ వర్సెస్ కమల
నేడే తొలి డిబేట్

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరులో కీలక అధ్యాయానికి రంగం సిద్ధమైంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమాక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ మొదటిసారి ముఖాముఖి చర్చలో పాల్గొననున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 6:30 గంటలకు ఫిలడెల్ఫియా వేదికగా వీరి చర్చా కార్యక్రమం జరుగుతుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థుల చర్చా కార్యక్రమాలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థులు వారు విజయం సాధిస్తే దేశానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో ఈ చర్చల్లోనే వెల్లడిస్తారు.

కుటుంబానికి ఒక రోజు గ్యాస్ ఖర్చు రూ.5!
కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారుల కుటుంబాలకు ఒక రోజు గ్యాస్ ఖర్చు కేవలం రూ.5లే అవుతుందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పేర్కొన్నారు. మిగతా గ్యాస్ వినియోగదారుల కుటుంబాలకు సుమారుగా రూ.12 ఖర్చవుతుందని చెప్పుకొచ్చారు. డాలర్ మారకపు రేటు ఆధారంగా ఈ లెక్కింపు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో మంగళవారం పోస్ట్ చేశారు. ఉజ్వల పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఈ పథకం కారణంగా 2014లో 14 కోట్లుగా ఉన్న ఎల్పీజీ కనెక్షన్లు 2024 నాటికి 33 కోట్లకు పెరిగాయన్నారు.

పిల్లలకు కోచింగ్ క్లాసులు
సరైన మార్గం కాదు
ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి

బెంగళూరు, సెప్టెంబర్ 10: కోచింగ్ క్లాసులపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి విమర్శలు గుప్పించారు. పరీక్షల్లో పిల్లలు మెరుగ్గా రాణించేందుకు కోచింగ్ క్లాసులు సరైనమార్గం కాదని అభిప్రాయపడ్డారు. తరగతి గదిలో టీచర్లు చెప్పే పాఠాలపై శ్రద్ధ చూపని విద్యార్థులకే కోచింగ్ తరగతులు అవసరమవుతాయని పేర్కొన్నారు. పరీక్షల్లో పిల్లలు ఉత్తీర్ణులు కావడానికి కోచింగ్ క్లాసులు తప్పుడు మార్గంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బట్టీ పట్టడం కాకుండా విమర్శనాత్మక ఆలోచన పిల్లల విద్యకు పునాదిగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బెంగళూరులో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ను.. ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు పొందాలంటే కోచింగ్ సంస్థలు కీలకం కాదా? అని ఒకరు ప్రశ్నించారు. 'కోచింగ్ క్లాసులకు వెళ్తున్న చాలా మంది విద్యార్థులు తరగతి గదిలో టీచర్ మాటల్ని వినటం లేదు. వాస్తవ ప్రపంచం విసిరే సవాళ్లను పరిష్కరించే విశ్లేషణ, పరిశీలనకు మన విద్యలో ప్రాధాన్యం కల్పించాలి' అని అన్నారు. సమస్య పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచనకు 'కోచింగ్ క్లాసులు' ఆటంకంగా మారుతాయని ఆయన అన్నారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

- రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నిరసన
- డీజీపీ రాజీనామాకు డిమాండ్
- శాంతిభద్రతలు నెలకొల్పడంలో విఫలమయ్యారని ఆరోపణ
- రాజ్‌భవన్ ముట్టడికి యత్నం
- ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించిన పోలీసులు
- ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్
- రెండు జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ

సోమవారం సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి చేస్తున్న ఆల్ మణిపూర్ స్టూడెంట్స్ యూనియన్ సభ్యులు

ఇంఫాల్, సెప్టెంబర్ 10: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల నిరసనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నది. రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో పూర్తిగా విఫలమైన రాష్ట్ర డీజీపీ, రక్షణ సలహాదారుడిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. వేలాది మంది విద్యార్థులు, మహిళలు ఇంఫాల్‌లోని రాజ్‌భవన్ వైపు ప్రదర్శనగా వెళ్లడానికి ప్రయత్నించగా, వారిని కాంగ్రెస్ భవన్ వద్ద భద్రతా దళాలు అడ్డుకున్నాయి. దీంతో విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వారిపై రాళ్లు, గ్లాస్ మార్బుల్ బాల్స్‌తో దాడి చేయడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. ఘర్షణల్లో 40 మందికిపైగా విద్యార్థులు గాయపడ్డారు.

అదనంగా మరో 2000 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు

రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూను విధించారు.ఐదు రోజుల పాటు ఐదు లోయ జిల్లాల్లో ఇంటర్నెట్‌ను నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మణిపూర్‌లో పరిస్థితులను అదుపు చేయడానికి 2,000 మందితో మరో రెండు సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లను మోహరించనున్నట్టు కేంద్రం తెలిపింది. ఇందులో తెలంగాణలోని వరంగల్‌కు చెందిన 58న నంబర్ బెటాలియన్‌ను, జార్ఖండ్‌లోని 112 నంబర్ బెటాలియన్‌ను తరలించనున్నట్టు మంగళవారం అధికారులు తెలిపారు.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన?

- బీజేపీ ఎమ్మెల్యేల ప్రతిపాదన
- హోం శాఖకు పంపిన రాష్ట్రపతి
- కమలం పార్టీ కనుసన్నల్లో ముర్ము
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధింపుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. మద్యం పాలసీ కేసులో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలులో ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం నెలకొన్నదని, రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బీజేపీ ఎమ్మెల్యేలు వినతి పత్రం సమర్పించడం, దానిని ఆమె కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిశీలనకు పంపడంతో ఈ ఊహాగానాలు మరింత అధికమయ్యాయి. 'ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గత కొన్ని నెలలుగా జైలులో ఉండటంతో అభివృద్ధి కుంటుపడింది. పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తి జైలులో ఉండటం, సీఎం బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంతో ఇక్కడ రాజ్యాంగ సంక్షోభం నెలకొంది' అంటూ బీజేపీ ఆరోపించింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. కాగా, బీజేపీ ఆరోపణలపై అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా మండిపడుతున్నది. కమలం పార్టీ కనుసన్నల్లో రాష్ట్రపతి పనిచేస్తున్నారని ఆరోపించింది.

ఆప్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కేంద్రం కుట్ర

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ, కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు దొడ్డిదారిన కుట్ర పన్నుతున్నదని ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత ఆతిశీ మంగళవారం ఆరోపించారు. ఒక వేళ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని మోదీ ప్రభుత్వం పడగొడితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం 70 సీట్లను గెల్చుకుంటుందని, ఢిల్లీ ప్రజలు బీజేపీకి సున్నా సీట్లతో బుద్ధి చెబుతారని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, మణిపూర్ రాష్ట్రాల్లో చేసిన విధంగా ఆపరేషన్ లోటస్ ద్వారా విపక్ష రాష్ట్రాలను అధికారంలోంచి దించేయడమే బీజేపీ పని అని ఆతిశీ విమర్శించారు. అయితే ఇదే మంత్రాన్ని బీజేపీ ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేలను తస్కరించడానికి ప్రయోగించి విఫలయ్యిందని ఆమె అన్నారు.

దుబాయ్ యువరాణి 'డివోర్స్' పర్‌ఫ్యూమ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: 'ఇన్‌స్టాగ్రామ్' ద్వారా భర్తకు విడాకులు పంపి సంచలనం సృష్టించిన దుబాయ్ యువరాణి షేక్ మెహ్రా అల్ మక్తోమ్ తాజాగా మరో ఆసక్తికర ప్రకటన చేశారు. 'డివోర్స్' పేరుతో సరికొత్త పర్‌ఫ్యూమ్‌ను మార్కెట్లోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. 'ఇన్‌స్టాగ్రామ్'లో తన కొత్త ప్రొడక్ట్ టీజర్‌ను ఆమె విడుదల చేశారు. విరిగిన గాజు, నల్ల చిరుతను ఆ వీడియోలో చూపెట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 30 ఏండ్ల షేక్ మహ్రా 2023 మేలో దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తను వివాహం చేసుకున్నారు. కొద్ది నెలల క్రితమే వారికి ఒక పాప జన్మించింది. ఇతర మహిళలతో సన్నిహితంగా ఉన్నాడంటూ తన భర్తకు జూలైలో ఇన్‌స్టా ద్వారా ఆమె విడాకులు పంపింది.

తలపై సీసీటీవీ కెమెరా బిగింపు!

న్యూఢిల్లీ: అమ్మాయిలపై ఇటీవల జరుగుతున్న అఘాయిత్యాలు అందరినీ కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అవుతున్న వీడియో అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. అందులో ఓ యువతి తలపై సీసీటీవీ కెమెరా బిగించి ఉంది. పాకిస్థాన్‌లోని కరాచీకి చెందిన ఆ యువతి తలపై స్వయంగా తండ్రే ఈ కెమెరాను అమర్చాడట. తద్వారా ఆమెను నిరంతరం పర్యవేక్షించే వీలుంటుందని అతని భావన. తన తండ్రి ఏం చేసినా తన మంచికోసమేనని ఆమె సమర్థించుకున్నది. కరాచీలో ఇటీవల సంచలనం సృష్టించిన హిట్ అండ్ రన్ కేసు కారణంగానే తన తండ్రి ఈ నిర్ణయం తీసుకున్నారని, తనకేదైనా జరిగినా సాక్ష్యం అయినా ఉంటుందని వివరించింది.

అత్యుత్తమ దేశంగా స్విట్జర్లాండ్

*న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: యూఎస్ న్యూస్ & వరల్డ్ రిపోర్ట్ వెలువరించిన 'ఉత్తమ దేశాల ర్